


టన్ను చీనీ రూ.23,200

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,200, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 300 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



న్యూస్‌రీల్

నిలకడగా చింతపండు ధరలు



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: మార్కెట్‌లో చింతపండు ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 1,390 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.18 వేల ప్రకారం ధర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ. 13 వేలు, కనిష్టంగా రూ.4,500, సగటున రూ. 6,500 ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌లో చింత పండు ధరలు నిలకడగా కొనసాగుతుండటంతో చిరు వ్యాపారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 214 మంది గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు లాంగ్వేజ్ పేపర్–2 పరీక్ష 42 కేంద్రాల్లో నిర్వహించారు. ఒకేషనల్, జనరల్ విభాగాల్లో 214 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. జనరల్ విద్యార్థులు 9,256 మంది గాను 9,080 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,141 మందికి గాను 1,103 మంది మాత్రమే హాజరయ్యారు. రెండు విభాగాల్లోనూ కలిపి 214 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

'పచ్చ' పైశాచికం!

- వివాహితను వేధించిన టీడీపీ నాయకుడు, కేసు నమోదు



మంజునాథ్

పెనుకొండ రూరల్: వివాహితను వేధించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించిన టీడీపీ నాయకుడితో పాటు అతని తల్లి, భార్యపై 'కియా' పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన వివాహిత ఆదివారం మధ్యాహ్నం ఇంటి ఎదుట దుస్తులు ఉతుక్కుంటుండగా... అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్డి మంజునాథ్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయగా అక్కడి నుంచి పారిపోయాడు. అయితే మంజునాథ్ గ్రామం వదలి వెళ్లేందుకు సదరు వివాహితనే కారణమంటూ మంజునాథ్ తల్లి, భార్య ఇతర కుటుంబ సభ్యులు వివాహితపై దాడి చేశారు. దీంతో బాధితురాలు 'కియా' పోలీసులకు ఫిర్యాదు చేయగా...మంజునాథ్‌తో పాటు అతని తల్లి, భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

కమీషన్ల కథ..
గుడ్లు తేలేసేలా!



- కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టర్ల నుంచి టీడీపీ నేతల వసూళ్లు
- ఒక్కో నియోజకవర్గానికి నెలకు రూ.2 లక్షల సుంకం
- రవాణా కాంట్రాక్టు కూడా తమకే ఇవ్వాలని పట్టు
- కమీషన్లు ఎక్కువగా ఇవ్వాలని శ్రీ సత్యసాయి జిల్లా మంత్రి హుకుం
- 'పచ్చ' నేతల నిర్వాకంతో గుడ్డు సైజు తగ్గిందన్న విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పాలిచ్చే ఆవును పోగొట్టుకుని తన్నే దున్నపోతును తెచ్చుకున్న చందంగా మారింది కాంట్రాక్టర్లు, ఉద్యోగుల పరిస్థితి. చివరకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు అందించే కోడిగుడ్ల మీద కూడా కమీషన్ ఇవ్వనిదే సరఫరా చేయడానికి వీల్లేదని తెలుగు తమ్ముళ్లు తేల్చి చెప్పడంతో శ్రీ సత్యసాయి జిల్లాలో కోడిగుడ్ల సరఫరాదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మొదలు రేషన్ డీలర్ల వరకూ పగబట్టి తొలగించిన పచ్చ నేతలు.. ఇప్పుడు కోడిగుడ్ల కాంట్రాక్టర్లనూ పీల్చి పిప్పి చేస్తున్నారు.

మామూళ్లివ్వకుండా సరఫరా ఎలా?

శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాలున్నాయి. వీటిలో 21 మండలాలకు ఒకరు, మిగతా మండలాలకు మరొకరు కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఈ ఇద్దరి నుంచి ప్రతి నెలా ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ముక్కుపిండి సుంకం వసూలు చేస్తున్నారు. ముందుగా గుడ్డుకు ఇంత ఇవ్వాలని డిమాండు చేయగా.. కాంట్రాక్టర్లు ససేమిరా అనడంతో ఒక్కో నియోజకవర్గం నుంచి నెలకు రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ మంత్రి ఇంకో అడుగు ముందుకు వేసినట్లు తెలిసింది. తాను నియోజకవర్గానికి మంత్రిని కాదని, రాష్ట్రానికి మంత్రిననీ, జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి మామూళ్లు తనకే ఇవ్వాలని డిమాండు చేసినట్లు సమాచారం.

కదిరిలో ప్రత్యేక చట్టం..

కదిరి నియోజకవర్గంలో ప్రత్యేక చట్టం అమలవుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ టెండరు వేసింది కాంట్రాక్టరైతే సరఫరా చేసేది టీడీపీ నేతలు కావడం గమనార్హం. 'టెండరు నువ్వే వేసినా మేమే సరఫరా చేస్తాం' అంటూ తెగేసి చెప్పడంతో సదరు కాంట్రాక్టరు మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

మండలానికి ఒకరు చొప్పున..

టీడీపీ నేతలు దిగజారుతున్న తీరుపై కాంట్రాక్టర్లు అన్నీ వదిలి వెళ్లి పోతే మంచిదన్న పరిస్థితి వచ్చింది. గుడ్ల సరఫరా అంటే కొనుగోలు, సరఫరా రెండూ కాంట్రాక్టరువే. కానీ సరఫరా చేసే కాంట్రాక్టరును బెదిరించి మండలానికి ఒకరి చొప్పున రవాణా కాంట్రాక్టును నేతలకు ఇప్పించారు. దీంతో ఒక్కోసారి రవాణాలో జాప్యం జరిగినా ప్రశ్నించే వారు లేకుండా పోయిన పరిస్థితి. గతంలో కాంట్రాక్టరే గుడ్లను కొనుగోలు చేసి ఆయా స్కూళ్లకు, అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

సైజు చిన్నబోయింది

నిబంధనల ప్రకారం కోడిగుడ్డు సగటున 52 గ్రాముల బరువు ఉండాలి. కానీ శ్రీ సత్యసాయి జిల్లాకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు ఒక్కొక్కటి 48 గ్రాములే ఉంటున్నాయని తేలింది. బరువు తక్కువగా ఉన్న గుడ్లు అయితే రేటు తక్కువ పడుతుందని ఇలా చేస్తున్నట్టు సమాచారం. కోడిగుడ్ల రేటు ఏరోజుకారోజు నిర్ణయించినా సైజు తక్కువగా ఉన్నవి తక్కువ రేటు ఉంటాయి. ఈ క్రమంలో టీడీపీ నేతలే సరఫరా చేస్తున్నారు కాబట్టి కేంద్రాలకు గుడ్లు వస్తున్నాయా లేదా, వాటి సైజు ఎంత అనే ప్రశ్నించే వారే కరువయ్యారు.

తప్పని పరిస్థితి..

గతంలో కోడిగుడ్లు బళ్లారి, హొస్పేట తదితర చోట్ల కొనుగోలు చేసి జిల్లా స్టాకు పాయింట్లకు మేమే సరఫరా చేసేవాళ్లం. ఇప్పుడు ఎమ్మెల్యేలు టీడీపీ నాయకులకు రవాణా కాంట్రాక్టు ఇవ్వాలని అడిగారు. తప్పనిసరి పరిస్థితిలో ఇచ్చాం. వాళ్లే సరఫరా చేస్తున్నారు.

– శరత్, కోడిగుడ్ల కాంట్రాక్టర్, శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిల్లాలో...

ప్రాథమిక పాఠశాలలు	1,527
విద్యార్థులు	41,524
ప్రాథమికోన్నత పాఠశాలలు	485
ఈ స్కూళ్లలో విద్యార్థులు	80,313
అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
చిన్నారులు	99,142
జిల్లాలో నెలకు కోడిగుడ్ల సరఫరా	45,00,000

బాలింత మృతి

- డాక్టర్ నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ



ప్రీతి (ఫైల్)

హిందూపురం టౌన్: పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన బాలింత కొద్ది గంటల్లోనే మృతి చెందగా, వైద్యుల నిర్లక్ష్యమే కారణంటూ బంధువులు ఆరోపించారు. మృతురాలి భర్త హరి తెలిపిన వివరాల మేరకు...పట్టణంలోని సూరప్ప కట్ట ప్రాంతానికి చెందిన ప్రీతి(25) ఈ నెల 1వ తేదీన ప్రసవ నొప్పులతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. డాక్టర్ నీరజ ఆమెను పరీక్షించి సిజేరియన్ చేశారు. ప్రీతి మగశిశువుకు జన్మనివ్వగా కుటుంబీకులంతా ఆనంద పడ్డారు. అయితే సిజేరియన్ తర్వాత ప్రీతికి రక్తస్రావం ఎక్కువగా జరిగి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. దీంతో డాక్టర్ నీరజ అనంతపురం రెఫర్ చేశారు. ఆ సమయంలో 108 అందుబాటులో లేకపోవడంతో.. ప్రైవేటు అంబులెన్సులో ప్రీతిని బంధువులు అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ప్రీతి 2వ తేదీన మధ్యాహ్నం మృతి చెందింది. అయితే డాక్టర్ నీరజ నిర్లక్ష్యం వల్లే తన భార్య చనిపోయిందని ప్రీతి భర్త హరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం హిందూపురం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. అంత్యక్రియల తర్వాత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై డాక్టర్ నీరజను వివరణ కోరగా.... సిజేరియన్ సమయంలో ప్రీతికి రక్తస్రావం జరిగి ప్లేట్‌లెట్లు తగ్గిపోయాయన్నారు. దీంతో స్థానికంగా ప్లేట్‌లెట్స్ అందించడానికి అవకాశం లేకపోవడంతో అనంతపురానికి రెఫర్ చేశామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని తెలిపారు. వైద్యసేవల్లో ఎలాంటి నిర్లక్ష్యమూ వహించలేదన్నారు.

హెంజేరు.. భక్తజనహోరు



సిద్ధేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేషభక్త జనం (ఇన్‌సెట్) వెండి అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

- వైభవంగా సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

'ఓం నమఃశివాయ' అన్న పంచాక్షరీ మంత్రం ప్రతిధ్వనించింది. ఓంకార నాదం మార్మోగింది. 'సిద్ధేశ్వరస్వామికి జై' అంటూ భక్తకోటి చేసిన నినాదం హోరెత్తింది. శివనామస్మరణ మధ్య హేమావతి గ్రామంలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. ఓంకార నాదం చేస్తూ రథాన్ని ముందుకులాగారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన జనం రథంపైకి అరటిపండ్లు, బెల్లం, పూలు, మిరియాలు విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక నుంచి వచ్చిన గురువులు చేసిన 'వీరగాసే' నృత్యం ఆకట్టుకుంది.

– హేమావతి (అమరాపురం):

నాణ్యమైన పరిష్కారం చూపకపోతే చర్యలు

- 'పీజీఆర్ఎస్'లో అందే అర్జీలు పునరావృతం కాకూడదు
- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ టీఎస్ చేతన్



ఓ అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ''ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి. అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటే.. అర్జీ దారు మళ్లీ పీజీఆర్ఎస్‌కు వస్తారు. అందువల్ల ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి. ఏ సమస్యపై అయినా అర్జీ రీఓపెన్ అయితే సంబంధిత శాఖ అధికారిపై చర్యలు తీసుకుంటాం'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని 'పీజీఆర్ఎస్' సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 246 అర్జీలు అందగా, కలెక్టర్ పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా సామాజిక పింఛన్లు, ఇంటి పట్టాలు, భూ సమస్యలపై అర్జీలు అందాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రోజూ అన్ని శాఖల అధికారులు పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీల స్థితి గతులను పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్‌కుమార్, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్డీఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో భూఆక్రమణకు అడ్డుకట్ట వేయండి

ప్రపంచ ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయం తూర్పు ద్వారం ఎదురుగా 396 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టారని హిందూపురానికి చెందిన నాగరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూ ఆక్రమణపై లేపాక్షి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీ సమర్పించారు. స్పందించిన కలెక్టర్... వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

కష్టాల 'వారధి'

మలకవేమల గ్రామం మీదుగా జాతీయ రహదారి నిర్మిస్తారంటే అక్కడి ప్రజలు ఎంతో సంతోషించారు. అవసరమైన భూములను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అయితే ఆ ఊరికి ఉన్న ఏకైక రహదారి మూతపడి అండర్ పాస్ పేరిట ఎత్తు తగ్గిపోవడంతో రాకపోకలకు ప్రతిబంధకంగా మారింది. అండర్‌పాస్‌కు అటువైపు ఉన్న పొలాలకు ఎరువులు, పురుగుమందులు తీసుకెళ్లే అవకాశం లేక.. పంట ఉత్పత్తులు ఇటువైపునకు తెచ్చుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.



ఈ వంతెనలో ఎలా వెళ్లేదని రాస్తారోకో చేస్తున్న దృశ్యం(ఫైల్)

- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- మలకవేమల వద్ద తక్కువ ఎత్తులో బ్రిడ్జి
- ఊర్లోకి వాహనాలు వెళ్లాలంటే కష్టమే
- సమస్యను పట్టించుకునే వారు కరువు

ముదిగుబ్బ: మండలంలోని మలకవేమలలో 150 నివాస గృహాలు ఉన్నాయి. 560 మంది వరకు జనాభా ఉంది. ఈ గ్రామం మీదుగా ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం.. ఆ గ్రామ ప్రజలకు శాపంగా పరిణమించింది. తక్కువ ఎత్తు.. అదీ గ్రామీణ రోడ్డుకు వంకరగా అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. పది అడుగుల లోపు ఎత్తు మాత్రమే ఉన్న బ్రిడ్జి కింద నుంచి వ్యవసాయ పంట ఉత్పత్తులు, గడ్డి తదితర వస్తువులు ఏవైనా ట్రాక్టర్లు లేదా లారీల ద్వారా తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

రాకపోకలకు కష్టమే..

జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లడానికి ఒకే ఒక దారి ఉంది. అక్కడ రాకపోకల కోసం అండర్ పాస్ (బ్రిడ్జి)ని నిర్మించారు. ప్రస్తుతమున్న గ్రామీణ రోడ్డుకు ఎదురుగా కాకుండా క్రాస్‌గా ఏర్పాటు చేశారు. బ్రిడ్జి కింది నుంచి వెళ్లాలంటే వాహనదారులకు తిప్పలు తప్పవు. అదీ తక్కువ ఎత్తు ఉంది. గ్రామానికి చెందిన రైతులకు రోడ్డుకు అటువైపుగా 250 ఎకరాల దాకా భూములు ఉన్నాయి. అందులో పండించిన పంటలతో పాటు.. వేరుశనగ, కంది, వరి గడ్డి తదితర తోపులు వేసుకొచ్చే ట్రాక్టర్, లారీ తదితర వాహనాలు అండర్‌పాస్‌లోంచి వెళ్లే పరిస్థితి లేదు. ఇక విద్యార్థులను తీసుకెళ్లే స్కూలు బస్సులు కూడా ఊరిలోకి వచ్చే అవకాశం లేదు. నిర్మాణ సమయంలోనే బ్రిడ్జి ఎత్తు పెంచాలని గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు ఎటువంటి స్పందనా రాలేదు. మంత్రి సత్యకుమార్ అయినా తమ ఇబ్బందులను గుర్తించి బ్రిడ్జి ఎత్తును పెంచి.. రోడ్డుకు ఎదురుగా ఉండేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



తక్కువ ఎత్తుతో నిర్మించిన వంతెన

గ్రామం ఉందని తెలీదా..?



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారులకు గానీ, కాంట్రాక్టర్‌కు గానీ రోడ్డుకు ఇటువైపు ఒక గ్రామం ఉందనే విషయం తెలియదా..? తక్కువ ఎత్తులో బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది అవుతుందనే కనీస ఆలోచన కూడా రాలేదా? ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– వెంకటనారాయణ, మలకవేమల

మరీ ఇంత అన్యాయమా?



మా గ్రామ పొలాలన్నీ రోడ్డుకు అటువైపే ఉన్నాయి. పండించిన పంటను ట్రాక్టర్లలో తీసుకురావాలంటే ఇరుకైన వంతెనలో సాధ్యపడదు. స్కూలు బస్సులు కూడా గ్రామంలోకి వచ్చే అవకాశం లేదు. జాతీయ రహదారి పక్కనే ఉన్న మలకవేమల గ్రామానికి అన్యాయం జరుగుతుంటే పట్టించుకునే వారే లేరా..? అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోకి వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలి.

– నిర్మలారెడ్డి, మలకవేమల

మాట తప్పడం చంద్రబాబు నైజం

- 'సూపర్‌సిక్స్'కు బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం
- అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే రోడ్డెక్కుతాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: ''మోసం..నమ్మక ద్రోహం..మాట తప్పడం.. చంద్రబాబు నైజం. అందుకే ఆయన ఇచ్చిన హామీలేవీ అమలు చేయరు'' అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆమె మండలంలోని ఊటుకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు విధానాలను తప్పుబట్టారు. నిరుపేదల సంక్షేమంపై చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే 'సూపర్ సిక్స్' హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేవారన్నారు. అలవిగాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం...ఆ తర్వాత అధికారమిచ్చిన ప్రజలను అష్టకష్టాలు పెట్టడం చంద్రబాబుకు కొత్తేమీకాదన్నారు. పింఛన్లను చూపుతూ ప్రచార ఆర్భాటం తప్ప.. కూటమి సర్కార్ 9 నెలల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల కాలంలోనే 90 శాతం హామీలు అమలు చేశారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్ సీపీ సర్కార్ నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయగా... ప్రస్తుత సీఎం చంద్రబాబు మాత్రం ''వైఎస్సార్ సీపీ వాళ్లకు మేలు చేస్తే పాముకు పాలు పోసినట్టే'' అని వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. నాడు జగనన్న మంచి చేశారు కాబట్టే నేడు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కాలరు ఎగరేసుకుంటూ తిరుగుతున్నారన్నారు. జనం కూడా జగనన్న పాలనను మెచ్చుకుంటున్నారన్నారు.

అన్యాయం జరిగితే సహించం..

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. చంద్రబాబు చెప్పినట్లు వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు అన్యాయం చేయాలని చూస్తే రోడ్డెక్కి పోరాడతామన్నారు. అర్హత ఆధారంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించాల్సిందేనన్నారు.

పవన్, పురందేశ్వరి ప్రశ్నించరా..?

ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. నిరుపేదలకు అన్యాయం జరిగితే సహించబోమంటూ ప్రగల్భాలు పలికిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూటమి సర్కార్ వైఫల్యంపై ఎందుకు ప్రశ్నించడం లేదని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. గద్దెనెక్కి 9 నెలలు గడిచినా హామీలు అమలుకు ముందుకు రాని చంద్రబాబును వారు ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ దిలీప్, ఎంపీటీసీ సభ్యురాలు అమరావతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 44 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 44 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని వాటి పరిష్కారానికి చట్టపరిధిలో చొరవ తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత, గిరిజన ఉద్యోగులపై కక్ష సాధింపులు మానాలి

- ఏపీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయరామ్

పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళిత, గిరిజన ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్ సస్పెన్షనే ఇందుకు నిదర్శనమని ఏపీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కటిక జయరామ్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సహజ న్యాయ సూత్రాలను కూటమి సర్కార్ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. అనుమతి లేకుండా విదేశీ పర్యటన చేసినందుకు సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వం చెప్పుకోవడం సబబు కాదన్నారు. సునీల్‌కుమార్ తన సొంత ఖర్చులతోనే అమెరికా పర్యటనకు వెళ్లారని, ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. దీనిపై కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఆయనపై చర్యలు తీసుకోవడం కుట్రలో భాగంగానే అర్థమవుతోందన్నారు. వెనుకబడిన కులాలకు చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగులకు పోస్టింగ్‌లు కల్పించక పోవడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపులకు పరాకాష్టగా పేర్కొన్నారు. ఇప్పటికైనా దళిత, గిరిజన ఉద్యోగులపై కక్ష సాధింపులు మానకపోతే కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

అధికారం మాదే... అడిగేవారెవరు?



- 20 ఏళ్లుగా ఖాళీగా ఉన్న స్థలంపై టీడీపీ నేతల కన్ను
- ఆక్రమణదారులకు ఊతమిస్తున్న కనగానపల్లి మండల పచ్చనేత
- ఆక్రమించి బండలు నాటుతున్న వైనం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు
- వంకను కుదించి దాదాపు రెండెకరాల స్థలం చదును

రాప్తాడు రూరల్: అనంతపురం నగరం చుట్టూ భూములకు విపరీతమైన ధరలు రావడంతో తెలుగుదేశం పార్టీ చోటా నాయకులుగా చెలామణి అవుతున్న కొందరు ప్రభుత్వ భూములపై కన్నేశారు. అధికారం ఉందనే ధైర్యంతో రెచ్చిపోతున్నారు. పైసా పెట్టుబడి లేకుండా అప్పనంగా రూ. లక్షలు సంపాదించాలంటే ప్రభుత్వ భూములు కబ్జా చేయడమే మార్గంగా ఎంచుకున్నారు. ఇందులో భాగంగానే 20 ఏళ్ల కిందట ఓపెన్ స్థలాలుగా వదిలిన వాటిని దర్జాగా ఆక్రమించేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని మటన్ మార్కెట్ కాలనీ (ఇందిరమ్మకాలనీ)లో ఆక్రమణే ఇందుకు ఉదాహరణ.

నాలుగు రోజుల క్రితం రంగంలోకి తమ్ముళ్లు

కురుగుంట పొలం సర్వే నంబర్ 83-11, 12లో దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద 178 ప్లాట్లు మంజూరు చేసింది. ఇందులో గుడి, పార్క్ కోసం వేర్వేరు ప్రాంతాల్లో స్థలాలను వదిలిపెట్టారు. అప్పటి నుంచి ఈ స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. ఇక్కడ సెంటు ధర రూ.3 లక్షలకు పైగా పలుకుతోంది. గుడి కోసం వదిలిన దాదాపు 22 సెంట్ల స్థలంపై కన్నేసిన టీడీపీ చోటా నాయకులు వెంటనే రంగంలోకి దిగి బండలు నాటించేస్తున్నారు. సెంటున్నర ప్రకారం 15 ఇళ్ల నిర్మాణాలకు స్కెచ్ వేశారు. బరితెగించి కబ్జా చేస్తుండడం వెనుక కనగానపల్లి మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి హస్తమున్నట్లు విశ్వసనీయ సమాచారం. తన వాటాగా లక్షలాది రూపాయలను ఆయన ముందుగానే తీసుకుని అభయం ఇవ్వడంతో చోటా నాయకులు మరింత రెచ్చిపోయారు.





ఇందిరమ్మ కాలనీలో గుడికి కేటాయించిన స్థలంలో నాటిన బండలు, వంకకు అడ్డంగా మట్టితో ఆనకట్ట నిర్మించి చదును చేసి బండలు నాటిన దృశ్యం

వంకను కుదించి.. చదును చేసి..

కురుగుంట పొలం సర్వే నంబర్ 83-11, 12కు సమీపంలోనే సర్వే నంబరు 89లో రెవెన్యూ రికార్డులలోని డైగ్లాట్ ప్రకారం తడకలేరు వంక స్థలంగా గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఈ వంక స్థలాన్ని సైతం కబ్జా చేసి పేదలకు అమ్మకానికి పెట్టారు. వర్షాకాలం వస్తే ఈ వంక ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఉపరితల ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని తట్టుకోలేక సమీప కాలనీలన్నీ మునిగిపోయిన సందర్భాలూ చాలా ఉన్నాయి. ఇలాంటి వంకను సైతం ఆక్రమించి ఆనకట్టలా మట్టితో నిర్మించి దాని పక్కనే ఇళ్ల స్థలాల కోసం బండలు నాటుతున్నారు. 'డబ్బు కొట్టు-స్థలం పట్టు' అన్న చందంగా పేదల నుంచి డబ్బు వసూళ్లు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే భవిష్యత్తులో పండమేరు వాగులో కాలనీలకు కాలనీలు మునిగిపోయిన ఘటన ఇక్కడ కూడా పునరావృతం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇది పూర్తిగా వంక ప్రాంతం

సర్వే నంబరు 89 అనేది పూర్తి వంక ప్రాంతం. ఈ ప్రాంతాన్ని చదును చేసి బండలు నాటుతున్నట్లుగా తెలియడంతో అక్కడికెళ్లి పనులు అడ్డుకున్నాం. ఎవరైనా మొండిగా బండలు నాటించాలని చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికీ తీసుకెళ్లాను.

– రామకృష్ణ, వీఆర్వో

అది ప్రజాప్రయోజనాల స్థలం

ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద ఏర్పాటైన కాలనీలో ప్రజాప్రయోజనాల కోసం కొంత స్థలాన్ని వదిలారు. గుడి కోసం వదిలిన స్థలంలో కొందరు బండలు నాటుతున్న విషయం తెలుసుకుని పనులు నిలబెట్టాలని చెప్పాం. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సర్వే చేయించి ప్రభుత్వ స్థలమంతా హద్దులు నాటి బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– చరణ్, పంచాయతీ కార్యదర్శి, కురుగుంట

ఆటో బోల్తా - మహిళ మృతి



మృతురాలు జల్లా భారతి

ముదిగుబ్బ: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ ప్రయాణికురాలు మృతి చెందింది. ముదిగుబ్బ మండలం సంకేపల్లి క్రాస్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ప్రయాణికులతో కదిరికి వెళుతున్న ఆటో సంకేపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. కాగా, మృతురాలు కదిరిలో ఉన్న తన కుమార్తెను చూసేందుకు వచ్చినట్టుగా తమతో చెప్పినట్లు పోలీసులకు తోటి ప్రయాణికులు తెలిపారు. తొలుత గుర్తు తెలియని మహిళ మృతిగా ముదిగుబ్బ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే గంటల వ్యవధిలోనే మృతురాలిని అనంతపురానికి చెందిన జల్లా భారతి(45)గా గుర్తించారు. కదిరిలో ఉన్న తన కుమార్తె జల్లా ఉదయలక్ష్మిని చూసేందుకు వచ్చిన ఆమె తిరిగి అనంతపురానికి వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందినట్లుగా పోలీసులు నిర్ధారించారు.

కనికరం లేని చంద్రబాబు

- అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ప్రశాంతి నిలయం: గద్దెనెక్కి ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క నిరుపేదకూ కూటమి ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చిన పాపాన పోలేదని, పేదల ఇంటి పట్టాలపై ముఖ్య మంత్రి చంద్రబాబుకు కనికరం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. జిల్లాలో అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సత్యమ్మ దేవాలయం నుంచి వేలాది మంది పేదలతో కలసి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇంటి స్థలంతో పాటు రూ.4 లక్షలతో ఇంటిని నిర్మించి ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ నిచ్చారని గుర్తు చేశారు. ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆ హామీపై నోరు మెదపడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని వెంటనే పేదల ఇంటి పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయాలన్నారు. జిల్లాలో పేదల స్థలాలు కొల్లగొట్టడంపై ఉన్న శ్రద్ధ వారికి భూములు పంచడంపై చూపడం లేదని మండిపడ్డారు. మంత్రి సత్యకుమార్ అనుచరుడు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ వ్యవహారమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదినారాయణ యాదవ్ కబ్జా చేసిన పేదల భూములను త్వరలో సీపీఐ ఆధ్వర్యంలో ఆక్రమించుకుంటామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ సువర్ణకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు దుర్గా భవానీ, ఆవుల శేఖర్, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెవులను రక్షించుకోవాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్: విపరీతమైన శబ్దాల నుంచి చెవులను రక్షించుకోవాలని, చెవికి సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే చికిత్స చేయించుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్, జిల్లా వైద్యాధికారి ఫైరోజా బేగం పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం పుట్టపర్తిలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర టీఎస్ చేతన్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం ముఖ్య అతిథులుగా హాజరై, ర్యాలీని ప్రారంభించారు. ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గణేష్ కూడలి వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పిల్లలు, వృద్ధులు వినికిడి లోపాలకు గురవుతుంటారని, ఎక్కువ శబ్దాలు వినడం వలన సమస్యలు ఉత్పన్నమవుతుంటాయన్నారు. వినికిడి లోపాలు ఉన్నవారికి కాక్లియర్ ఇంప్లాంట్ లాంటి శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా పిల్లల్లో వినికిడి లోపాలు ఉంటే త్వరగా గుర్తించి చికిత్స చేయించాలన్నారు. చెవుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత, లెప్రసీ అధికారి తిప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సునీల్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు

వివాహేతర సంబంధంతోనే హత్య

- ప్రియుడితో కలసి భర్తను హతమార్చిన భార్య
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ విజయకుమార్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: వివాహేతర సంబంధంపై మోజు ఓ వ్యక్తిని దారుణంగా పొట్టనబెట్టుకుంది. ప్రియుడితో కలసి భర్తను హతమార్చిన భార్యను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఉదయం పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ విజయ్‌కుమార్ వెల్లడించారు.

ఈ నెల 1న హత్య..

బుక్కపట్నం మండలం కొత్తకోటకు చెందిన చియ్యేడు గంగన్న కుటుంబం సుమారు 15 ఏళ్ల క్రితం వెంగళమ్మచెరువులో స్థిరపడింది. గంగన్న కుమారుడు చియ్యేడు నగేష్(35) సొంతంగా ట్రాక్టర్ పెట్టుకొని బాడుగలకు తిప్పడంతోపాటు బేల్దారి పనులకు వెళ్లేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలోని వెంకటేషు మామిడి తోటలో శనివారం సాయంత్రం నగేష్ మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపరుల సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరునవిలపించారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ రప్పించి ఆధారాల కోసం గాలింపు చేపట్టారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహం పక్కన మద్యం బాటిళ్లు పడి ఉండటంతో మద్యం మత్తులో గొడవ జరిగి హత్యకు గురయ్యాడా లేదా అక్రమ సంబంధం నేపథ్యంలో ఘటన జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగింది.

మిస్టరీ వీడిందిలా...

సీసీటీవీ ఫుటేజీల్లో అదే గ్రామానికి చెందిన దివాకర్ అనే వ్యక్తి నగేష్‌ను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లినట్లుగా ఫుటేజీలు లభ్యం కావడంతో పోలీసులు ఆ దిశగా విచారణ వేగవంతం చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. నగేష్ ఇంటికి దివాకర్ తరచూ రాకపోకలు సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో నగేష్ భార్య సునీతతో ఏర్పడిన చనువు కాస్త వివాహేతర సంబంధంగా మార్చుకున్నాడు. వీరిద్దరూ రోజూ గంటల తరబడి వీడియో కాల్‌లో మాట్లాడుకుంటుండడం గమనించిన నగేష్ పలుమార్లు తన భార్యను మందలించాడు. దీంతో నగేష్‌ను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని ప్రియుడు దివాకర్‌తో కలసి సునీత పథకం వేసింది. ఇందులో భాగంగానే ఈ నెల 1న నగేష్‌ను నమ్మించి మందు పార్టీ చేసుకుందామంటూ ద్విచక్ర వాహనంపై దివాకర్ పిలుచుకుని వెళ్లాడు. కర్ణాటక నాగేపల్లి శివారున ఉన్న మద్యం దుకాణంలో రెండు బాటిళ్ల మద్యం కొనుగోలుచేసి వీరాంజనేయపల్లి గ్రామ శివారున ఉన్న వెంకటేష్ మామిడి తోటలోకి వెళ్లారు. అక్కడ నగేష్‌తో ఫుల్‌గా మద్యం తాపించి అనంతరం తాను తెచ్చుకున్న కొడవలితో దాడి చేసి హతమార్చాడు. నిందితులను సోమవారం వారి ఇంటి వద్దనే పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. హత్య కేసులో మిస్టరీని ఛేదించి, నిందితులను అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ సురేష్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తితో పాటు సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు.



శ్రీమత్ ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము
కదిరి పట్టణము, శ్రీ సత్యసాయి జిల్లా, ఫోన్ నెం.: 08494-221066, 221366
Website : www.aptemples.ap.gov.in

సీల్డ్ టెండర్

(1) శ్రీవారి బ్రహ్మోత్సవములు-2025 సందర్భముగా 09-03-2025 to 23-03-2025 గాను 15 రోజులకు గాను 4 రాజగోపురములకు మరియు దేవస్థానము నందు, ఉప ఆలయములకు Colour Led Lights తో విద్యుత్ అలంకరణ.
(2) 09-03-2025 to 23-03-2025 వరకు 15 రోజులకు గాను ప్రధాన కూడలియందు దేవతల ప్రతిమలు Colour Led Lights తో విద్యుత్ అలంకరణ మరియు తూర్పు రాజ గోపురం నుండి తేరు వరకు రెండువైపులా, కోనేరు నందు Colour Led Lights తో విద్యుత్ అలంకరణ వేయుటకు గాను 1, 2 లకు అనుభవము, అర్హత కలిగిన సంస్థల నుండి సీల్డ్ టెండర్ కోరడమైనది. టెండరు షెడ్యూలు 04-03-2025 నుండి 06-03-2025 వరకు ఆలయములో జారీ చేయబడును. 07-03-2025 తేదీన ఉ॥ 10-30 గం॥ టెండర్ బాక్స్ నందు వేయవలెను. తదుపరి ఉ॥ 11-00 గం॥ టెండర్ బాక్స్ ఓపెన్ చేయబడును. మరిన్ని వివరములకు ఆలయములో సంప్రదించవచ్చును.

శ్రీ స్వామివారి సేవలో
వెండి దండి శ్రీనివాస రెడ్డి
ఉప కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



వంశీ (ఫైల్)

రొద్దం: అప్పులు తీర్చకపోతే గ్రామంలో పరువు పోతుందని భావించిన ఓ యువరైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు... రొద్దం మండలం పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన బోయ వంశీ (28)కు భార్య కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. తన తండ్రి పేరుతో ఉన్న 6 ఎకరాల పొలాన్ని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పంటల సాగు, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ 5 లక్షల అప్పుతో పాటు, తన భార్య బంగారు నగలు బ్యాంక్‌లో తాకట్టు పెట్టి మరో రూ 2 లక్షల రుణం తీసుకున్నాడు. అయితే పంటలు సక్రమంగా పండక పోవడంతో అప్పులు తీర్చలేక పోయాడు. దీంతో వడ్డీల భారం పెరిగి అప్పులు రూ.10 లక్షలకు చేరుకున్నాయి. ఈ క్రమంలో అప్పులు తీర్చలేకపోతే గ్రామంలో తలెత్తుకుని తిరగలేమన్న మనోవేదనకు లోనైన వంశీ... సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనులకు వెళ్లిన భార్య మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి చేరుకుని తలుపు తట్టినా లోపల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి కిటికిలో నుంచి చూసింది. విగతజీవిగా ఉరికి వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

తనకల్లు: మండలంలోని పెద్దపల్లికి చెందిన శాంతమ్మ (30) ఆత్మహత్య చేసుకుంది. చింతామణి తాలూకా రామాపురం గ్రామానికి చెందిన శాంతమ్మకు 15 సంవత్సరాల క్రితం పెద్దపల్లికి చెందిన వెంకటేష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు



వీసీ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్


ప్రశాంతి నిలయం: వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తాగునీటి పైప్‌లైన్లను తనిఖీ చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో రానున్న మూడు నెలలూ నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. బోరు బావులు, చేతి పంపులను మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయ సారథి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

భక్త జనసంద్రమైన దాదులూరు



ప్రత్యేక అలంకరణలో పోతలయ్య, బంగారు లింగయ్యస్వాములు

- వైభవంగా జ్యోతుల మహోత్సవం
- నేడు గావుల ఉత్సవం



కనగానపల్లి: మండలంలోని దాదులూరు వెలసిన పోతలయ్యస్వామి జాతరలో భాగంగా సోమవారం జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవులు, బంగారు లింగమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జ్యోతులు, బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చుట్టు ప్రక్కల గ్రామాల్లోని రైతులు ఎద్దులు, ట్రాక్టర్లతో పన్నేరు బండ్లు కట్టి ఆలయం చుట్టూ తిప్పారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి.

నేడు గావుల మహోత్సవం..

దాదులూరు పోతలయ్యస్వామి జాతరలో ప్రధాన ఘట్టమైన గావుల మహోత్సవాన్ని మంగళవారం తెల్లవారుజామున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, పూజార్లు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఉదయం జంతు బలులతో భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు.



బారులు తీరిన జనం



ఆలయం చుట్టూ తిప్పుతున్న పన్నారపు బండి

దొంగ బంగారం కలకలం

హిందూపురం అర్బన్: స్థానిక బంగారు దుకాణాల్లో సోమవారం కర్ణాటక పోలీసులు తనిఖీలు చేపట్టారు. కర్ణాటకలోని చిత్రదుర్గలో దొంగలించిన బంగారాన్ని హిందూపురంలోని రెండు దుకాణాల్లో విక్రయించినట్లుగా పట్టుబడిన నిందితుడి సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. అయితే ఎంత బంగారం దొంగలించారు? ఎవరు కొన్నారు? అనే వివరాలు వెల్లడించేందుకు కర్ణాటక పోలీసులు విముఖత వ్యక్తం చేశారు.

హెచ్ఎం సెల్‌ఫోన్ చోరీ

పెనుకొండ: బస్సు ఎక్కబోతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను దుండగులు అపహరించారు. వివరాలు... రొద్దం మండలం పెదకోడిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం హరినాయక్ సోమవారం మధ్యాహ్నం పాఠశాలకు సెలవు పెట్టి అనంతపురం వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పెనుకొండలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రైవేట్ బస్సును ఎక్కుతున్న సమయంలో ఓ యువకుడు ఆయన జేబులోని సెల్‌ఫోన్‌ను అపహరించాడు. విషయాన్ని పసిగట్టిన హెచ్ఎం వెంటనే ఆ యువకుడిని పట్టుకోవడంతో స్థానికులు చుట్టుముట్టి సెల్‌ఫోన్ గురించి ఆరా తీశారు. యువకుడు తనకు తెలియదని బుకాయించాడు. దీంతో సదరు యువకుడిని ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేషన్ వద్ద ఆటో దిగిన యువకుడు అందరినీ పక్కకు తోసి ఒక్కసారి శ్రీరాములయ్య కాలనీ వైపు ఉడాయించి తప్పించుకున్నాడు. బాధిత హెచ్ఎం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.